ఆయిల్‌పాం నర్సరీని సందర్శించిన కలెక్టర్

సంగెం: గవిచర్లలో ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

సంగెం, జూలై 31: లోహిత గ్రామంలో ఆయిల్‌పాం నర్సరీని కలెక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. నర్సరీ నిర్వాహకులను మొక్కల వివరాలు, పెంచే విధానాన్ని తెలుసుకున్నారు. మండలంలోని ఏయే గ్రామాల్లోని రైతులు మొక్కలు తీసుకుని సాగు చేస్తున్నారో ఆ తోటలను తనకు చూపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీంతో గవిచర్ల, షాపురంలో ఆయిల్‌పాం క్షేత్రాలను సత్య శారద పరిశీలించి ఈజీఎస్ నుంచి నిర్వహణ ఖర్చులు నెలనెలా వస్తున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులను ప్రోత్సహించాలని, వారికి ఇబ్బందులు కలిగించొద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఆర్.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.రవీందర్, సురేశ్ నారాయణ్, ఉద్యాన అధికారి ఎన్.తిరుపతి, ఎస్.శంకర్, రైతులు పాల్గొన్నారు.

గణాంకాల పాత్ర కీలకం

గిర్మాజీపేట: సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధానం రూపకల్పనలో గణాంకాల పాత్ర కీలకమని కలెక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా గణాంకదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా గణాంకదర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, నీటి వనరులు, పంటలు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, లోకల్ బాడీ, ఇండస్ట్రీస్, సోషల్ సెక్యూరిటీ ఇలా అన్ని శాఖలకు సంబంధించిన అంశాలు ఉన్నట్లు చెప్పారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న సీఎం సభకు జిల్లా నుంచి ఉద్యోగోన్నతి పొందిన 634 మంది టీచర్లను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీపీవో గోవిందా రాజన్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఈవో వాసంతి, ఆర్డీవో కృష్ణవేణి, గణాంక అధికారి ఉషారాణి, ఉప గణాంక అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం సీకేఎం మహిళా ప్రసూతి దవాఖానలో నెలకొన్న సమస్యలపై ఐద్వా జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

'గుడిసెలు తొలగించిన వారిపై కేసులు పెట్టాలి'

చెన్నారావుపేట, జూలై 31: పనికర శివారులో పేదల గుడిసెలను తొలగిచిన వారిపై కేసులు పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో 2006లో గుడిసెలు వేసుకొని పేదలు జీవిస్తున్నారన్నారు. నవీన్‌రెడ్డి, అతడి అనుచరులు దొడ్డిదారిలో పట్టా చేయించుకొని భూమిని కబ్జా చేసేందుకు గుడిసెలను కూల్చివేశారని ఆరోపించారు. ఆయన వెంట సహాయ కార్యదర్శి బాషమియా, రమేశ్, లక్ష్మణ్, చెన్నకేశవులు, యాకయ్య ఉన్నారు.

వర్ధన్నపేట: ఇల్లందలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, గీసుగొండ: మరియపురం అభివృద్ధిని అధికారులకు వివరిస్తున్న మాజీ సర్పంచ్ బాలిరెడ్డి

గ్రామీణుల జీవన శైలిపై అధ్యయనం

- గ్రామాల్లో పర్యటిస్తున్న సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు

వర్ధన్నపేట/సంగెం, జూలై 31: గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలు, రైతుల జీవన విధానంపై సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఇల్లందలో మూడు రోజులుగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పోషకాహారం, విద్యను పరిశీలించారు. అనంతరం వరి పొలాల వద్దకు వెళ్లి సాగు విధానాన్ని పరిశీలించారు. తర్వాత గ్రామంలో శుభ్రతను తెలుసుకున్నారు. సంగెం మండలం తీగరాజుపల్లిలో కేంద్ర అధికారుల బృందం రెండో రోజు పర్యటించింది. ఈ సందర్భంగా వారు పంట పొలాలను సందర్శించారు. అనంతరం రైతు వేదికలో సమావేశం కాగా, ఏవో చట్ల యాకయ్య వారికి పలు అంశాలను వివరించారు.

మరియపురం అభివృద్ధి భేష్

గీసుగొండ: జాతీయ ఆదర్శ గ్రామాలైన మరియపురం, గంగదేవిపల్లిలో రెండు రోజులుగా కేంద్ర సచివాలయ గ్రూప్-1 అధికారుల బృందం పర్యటిస్తున్నది. బుధవారం ఆయా గ్రామాల్లో పర్యటించి అనేక విషయాలు తెలుసుకున్నారు. వ్యవసాయ పద్ధతులు, గ్రామాల అభివృద్ధి, ప్రజల జీవన విధానాన్ని అధికారులు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, అధికారుల ప్రోత్సాహం, ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మల చారిటబుల్ ట్రస్టు ద్వారా చేసిన పనులను వారికి వివరించారు. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ముందుకొచ్చిన వారికి రూ. రూ 20 వేల ఆర్థిక సాయం అందించామన్నారు. దీంతో గ్రామంలో 90 శాతం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకొని వినియోగిస్తున్నారని వివరించారు. దీంతో అధికారులు గ్రామాభివృద్ధిని మెచ్చుకున్నారు. అలాగే, గంగదేవిపల్లిలో అభివృద్ధి కమిటీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత కుటుంబాలు అధికంగా ఉంటాయని శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి అధికారుల బృందానికి వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం గంగదేవిపల్లి అభివృద్ధికి రూ. 10 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఆ నిధులతో గ్రామంలో విశాలమైన రోడ్లు, డ్రైనేజీలు, వైఫై, ట్రైనింగ్ సెంటర్‌తోపాటు అనేక భవనాలను నిర్మించుకున్నట్లు వెల్లడించారు.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం

కాశీబుగ్గ, జూలై 31: ఆధునిక వ్యవసాయం లాభదాయకమని, పనిముట్ల కొనుగోలుపై రైతులకు కంపెనీలు ప్రత్యేక రాయితీలు అందించడం అభినందనీయమని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల అన్నారు. మార్కెట్ పరిధిలోని మన అగ్రిటెక్ ఎక్స్‌పో చైర్మన్ పాశికంటి రమేశ్ ఆధ్వర్యంలో పలు కంపెనీలు ప్రత్యేక రాయితీపై బుధవారం వ్యవసాయ పనిముట్లు అందించాయి. అనంతరం కార్యదర్శి నిర్మలతోపాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎంతో ఉపయోగపడే టిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్స్, బాటరీ స్ప్రేయర్స్, ఇతర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రేడ్-2 కార్యదర్శి శ్రీరామోజు రాము, మాజీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్రావు, ఎస్సై రాజు, చాంబర్ ప్రధాన కార్యదర్శి వేదప్రకాశ్, కోశాధికారి అల్లె సంపత్, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు వీరారావు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న కార్యదర్శి నిర్మల, చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

చైన్‌స్నాచింగ్‌లపై పోలీసుల అలర్ట్

ఇద్దరు యువకులు రెండు ఘటనలకు పాల్పడినట్లు గుర్తింపు

నిందితుడి ఫొటో

వరంగల్, జూలై 31 (నమస్తేతెలంగాణ): వరంగల్ మహా నగరంలో పోలీసుల నిఘా కొరవడింది. ఈ నేపథ్యంలో గంజాయి రవాణా, విక్రయాలు, సేవించడం, చోరీలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయి. వరంగల్‌లో తాజాగా చైన్‌స్నాచింగ్‌లు మొదలయ్యాయి. అనూహ్యంగా ఒకేరోజు రాత్రి రెండు చైన్‌స్నాచింగ్‌లు జరిగాయి. ఇద్దరు యువకులు స్కూటర్‌పై ప్రయాణిస్తూ మంగళవారం రాత్రి వేర్వేరుగా రెండుచోట్ల మహిళల నుంచి బంగారం గొలుసులను అపహరించారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తవాడలో కూతురుతో కలిసి కాలినడకన వెళ్తున్న ఓ మహిళను స్కూటర్‌పై వెంబడించిన ఇద్దరు యువకులు ఆమె మెడలో నుంచి బంగారం గొలుసును లాక్కెళ్లారు. మరో గంటన్నర వ్యవధిలో ఇదే వరంగల్‌లో ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరంగల్‌చౌరస్తా సమీపంలోని మేదరివాడలో రాత్రి 9 గంటలకు ఓ దుకాణం నిర్వాహకురాలిని మాటల్లోకి దింపి అదే ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారం గొలుసును అపహరించారు. రెండుచోట్ల చైన్‌స్నాచింగ్‌కు పాల్పడింది ఆ ఇద్దరు యువకులేనని పోలీసులు తమ విచారణలో గుర్తించారు. వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. యువకులు తెల్ల కలర్ యాక్టివాపై వచ్చారని, ఆ ఇద్దరూ తెలుగులో మాట్లాడినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో నిందితులు స్థానికులే అయి ఉంటారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల్లో ఒకరి ఫొటోను బుధవారం రాత్రి విడుదల చేశారు. ఈ వ్యక్తిని పట్టించిన వారికి బహుమతి ఇస్తామని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి ప్రకటించారు. మట్టెవాడ ఎస్‌హెచ్‌వో నెంబర్ 8712685117, పోలీస్‌స్టేషన్ నంబర్ 8712685090కు సమాచారం ఇవ్వాలన్నారు.

పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం, జూలై 31: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సౌజన్య జీపీ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, జీపీ స్పెషలాఫీసర్లకు పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు.

బోనమెత్తుకున్న తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఘనంగా మైసమ్మ బోనాలు

కరీమాబాద్, జూలై 31: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో బుధవారం మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్లు పల్లం పద్మ, మరుపల్ల రవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

రుణాల కోసం రైతుల దరఖాస్తులు

కరీమాబాద్, జూలై 31: రుణమాఫీతో ఖిలావరంగల్ సొసైటీ బుధవారం రైతులతో కిటకిటలాడింది. వివరాలను తెలుసుకునేందుకు కార్యాలయానికి రైతులు భారీగా తరలివచ్చారు. రుణమాఫీ అయిన రైతులు వడ్డీ చెల్లించి మళ్లీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పలువురు తమకు రుణమాఫీ కాలేదని ఆరా తీశారు. ఇదిలా ఉండగా.. మొదటి విడతలో తమకు రుణమాఫీ కాలేదని సుమారు 80 మంది రైతులు ఫోర్టురోడ్డులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేశారు.

ఇద్దరి యువకుల మధ్య ఘర్షణ

గిర్మాజీపేట, జూలై 31: బట్టలబజార్ బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. మద్యం, గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు యువకులు ఘర్షణ పడగా, ఒకరు బ్రిడ్జి కింద పడడంతో గాయాలయ్యాయి. వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీసులను వివరణ కోరగా.. తమకు సమాచారం అందలేదని తెలిపారు.

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం

కరీమాబాద్, జూలై 31: ఉర్సు బైపాస్ రోడ్డులోని ఉర్సుగుట్ట సమీపంలో బుధవారం విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. వెంటనే స్థానికులు ఆటోలో ఉన్న విద్యార్థులను బయటకు తీసి 108కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకోగా.. పిల్లలకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లినట్లు 108 సిబ్బంది తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

గిర్మాజీపేట, జూలై 31: గురువారం నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి ఒక ప్రకటనలో కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులు వారోత్సవాల్లో విధిగా పాల్గొనాలని సూచించారు.

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

నల్లబెల్లి, జూలై 31: మండలకేంద్రంలోని కేజీబీవీలో స్వీపర్, స్కావెంజర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో చదువుల సత్యనారాయణ కోరారు. ఈ నెల 3వ తేదీలోగా కేజీబీవీలో దరఖాస్తులు అందించాలని, 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలు అర్హులని సూచించారు. మరింత సమాచారం కోసం కేజీబీవీలో సంప్రదించాలని కోరారు.

పనులు నిలిచినా బడ్జెట్ ఎలా పెరిగింది?

నర్సంపేటలో సమాచారం కోసం కౌన్సిలర్ల దరఖాస్తు

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

నర్సంపేట, జూలై 31: పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోయినా బడ్జెట్ ఎలా పెరిగిందని బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు దేవోజు తిరుమల, జుర్రు రాజు ప్రశ్నించారు. ఈ మేరకు నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో సమాచారం కోసం ఆర్‌టీఐ ద్వారా బుధవారం దరఖాస్తులను అధికారి నాగరాజుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి ఎక్కడికక్కడ ఆగిపోయినా బడ్జెట్ మాత్రం విపరీతంగా పెరిగిపోతున్నదని ప్రజలు కౌన్సిలర్లను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. అందుకు బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన పది మంది కౌన్సిలర్లు కలిసి దరఖాస్తు అందించారు. 2020 జనవరి 27 నుంచి 2024 వరకు వార్డుల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో ఎన్ని పనులు చేశారు. మున్సిపల్ నిధుల నుంచి ఎంత ఖర్చు చేశారు. ఎంతమందికి చెక్కులు ఇచ్చారో పూర్తి సమాచారం కౌన్సిలర్లకు ఇవ్వాలని కోరుతూ ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేశామని వారు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లూనావత్ కవిత, శీలం రాంబాబు, రామసహాయ శ్రీదేవి, గద్దె రజిత, గంప సునీత, రుద్ర మల్లీశ్వరి, బోడ గోలియా, బానాల ఇందిర పాల్గొన్నారు.

ఉపాధి కూలీల డబ్బులు చెల్లించాలి

నల్లబెల్లి, జూలై 31: ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్‌కన్నాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మండు వేసవిలో గ్రామాల్లో పనులు చేసిన ఉపాధి కూలీలకు నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు భూమా అశోక్, బాలకొమురు, శివరాత్రి కుమారస్వామి, మహేందర్, గట్టు మొగిలి పాల్గొన్నారు.

నిజాయితీతో ప్రజలకు సేవలు అందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా
- ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

గిర్మాజీపేట, జూలై 31: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు నిజాయితీతో సేవలు అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. వార్షిక పోలీస్‌స్టేషన్ల తనిఖీల్లో భాగంగా బుధవారం ఇంతెజార్‌గంజ్ స్టేషన్‌ను సీపీ సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మచ్చ శివకుమార్ సీపీకి స్వాగతం పలికి మొక్క అందజేశారు. ముందుగా స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సన్నిహిత సిబ్బంది పనితీరును పరిశీలించడంతోపాటు పెండింగ్ ఫైల్స్, రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై రోజూ నిఘా పెట్టాలన్నారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన నేరస్తులను అరెస్ట్ చేస్తే, ఆ సమాచారాన్ని ఆయా రాష్ట్రాలకు తెలియజేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ నందిరాం నాయక్, ఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేషన్‌పై అధికారులతో సమీక్ష

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి

పర్వతగిరి, జూలై 31: ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డి సమీక్షించారు. ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో ప్రజలు ఎవరైనా నూతన ఆవిష్కరణలు కనుగొంటే ఇన్నోవేషన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సంజీవరెడ్డి నేతృత్వంలో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో పాక శ్రీనివాస్, ఏపీవో సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి

పల్లెలు శుభ్రంగా ఉండాలి: జడ్పీ సీఈవో

సంగెం, జూలై 31: పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని కార్యదర్శులతో బుధవారం సాయంత్రం ఆయన సమీక్షించారు. గ్రామాల్లో ప్రతి వీధికి వెళ్లి డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలతోపాటు విద్యార్థులతో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, ఎంపీవో కొమురయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

CHANGE OF NAME

★ I, VIJAYRAJ RP S/o JASRAJ JI RP (New Name), previously called RAJPUROHIT BAGRAJ (Old Name), and residing at H.No. 12-1-137, Pinnavari Street, Warangal Dist., T.S, India, and solemnly declare.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

'మరమ్మతుల్లో జాప్యాన్ని సహించం'

వరంగల్, జూలై 31: పారిశుద్ధ్య వాహనాల మరమ్మతుల్లో జాప్యం చేస్తే సహించేది లేదని మేయర్ గుండు సుధారాణి హెచ్చరించారు. బుధవారం బాలసముద్రంలోని వెహికల్ షెడ్‌ను ఆమె తనిఖీ చేశారు. వాహనాల మరమ్మతులు పెండింగ్‌లో ఉండకుండా షిఫ్టుల వారీగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని సూచించారు. ప్రతి రోజు డీఈలు పర్యవేక్షించాలన్నారు. మరమ్మతులు చేసిన తర్వాత బయటకు వచ్చే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛ ఆటో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తూ ఇంటి యాజమాని సంతకం తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటోలకు చెత్త అందించని గృహాల వివరాలు తెలిపితే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో బల్దియా ఇన్‌చార్జి ఎస్‌ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గ్రేటర్ కమిషనర్

మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

కాశీబుగ్గ, జూలై 31: వరంగల్‌లోని లక్ష్మీపురం సమీకృత మార్కెట్ (ఐవీఎస్‌ఎం) నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మార్కెట్ నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న బస్టాండ్, తిలక్‌రోడ్డు, పోతన రోడ్ ప్రాంతంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, ఏఈలు రాగి శ్రీకాంత్, సతీశ్, హబీబ్ పాల్గొన్నారు.

ఎలుకల మందు తాగి యువకుడి ఆత్మహత్య

గీసుగొండ, జూలై 31: శీతల పానీయంలో ఎలుకల మందు కలుపుకొని తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దస్రు తండా శివారులోని మంగల్‌తండాలో జరిగింది. సీఐ బాబులాల్ కథనం ప్రకారం.. తండాకు చెందిన నూనవత్ సురేశ్(25) మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శీతల పానీయంలో ఎలుకల మందు కలుపుకొని తాగాడు. గమనించిన తండ్రి రాజు అతడిని అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

'రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా మార్చాలి'

మాట్లాడుతున్న మర్రి రవీందర్

గిర్మాజీపేట, జూలై 31: భద్రకాళీ బండ్ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా మార్చాలని భద్రకాళీ ట్యాంక్ బండ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్, సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు పలువురికి నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి రవీందర్ అధ్యక్షతన బుధవారం బృందావనకాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యపై లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ) సమావేశం నిర్వహించాలని మంత్రి సురేఖను కోరగా, వెంటనే స్పందించి కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల్లో అనిశ్చితి నెలకొందని, దీన్ని అధిగమించేందుకు గ్రేటర్ కమిషనర్ వెంటనే ఎల్‌పీసీ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. సమావేశంలో మల్లికార్జున్, సదానందం, సాయిలు, శ్రీనాథ్, జలేందర్, ప్రభాకర్, సంజీవాచారి పాల్గొన్నారు.

జీడబ్ల్యూఎంసీలో నలుగురు ఏఈల బదిలీ

వరంగల్, జూలై 31: బల్దియాలో పలువురు ఏఈలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అరవింద(జీహెచ్ఎంసీ), రమ్యకృష్ణ (నర్సంపేట, మున్సిపాలిటీ), రోజారాణి, రాజేశ్వరి టీయూఎఫ్ఐడీసీ వరంగల్ యూనిట్‌కు బదిలీ అయ్యారు. కేవలం ఒక్కరు మాత్రమే బల్దియాకు వచ్చారు. గౌతమి పరకాల మున్సిపాలిటీ నుంచి టెక్నికల్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చారు. సిటీ ప్లానర్ వెంకన్న, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్లు, ఈఈ బీఎల్ శ్రీనివాసరావు, డీఈలు సంజయ్‌కుమార్, ఇస్రత్ జహన్ రిలీవ్ అయ్యారు. పారిశుద్ధ్య కార్మికులు, అటెండర్లు, పంప్ ఆపరేటర్లు, వాచ్‌మెన్లు 26 మంది పరకాల మున్సిపాలిటీకి రిలీవ్ అయ్యారు. అయితే, ఒక్కరు కూడా బల్దియాకు బదిలీపై రాలేదు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా జిల్లా అధ్యక్షురాలిగా మల్లమ్మ

కరీమాబాద్, జూలై 31: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కరీమాబాద్ లక్ష్మీనగర్‌కు చెందిన వంటల మల్లమ్మ, ప్రధాన కార్యదర్శిగా మోహిని గాట్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర నాయకుల చేతులమీదుగా బుధవారం ఆమె నియామకపత్రం అందుకున్నారు. ఉద్యమకారులను మోసం చేస్తున్న ప్రభుత్వంపై పోరాటం చేస్తానన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆశయాలకనుగుణంగా పని చేస్తానన్నారు.

ప్రజల్లో చైతన్యం నింపిన నాటకాలు

గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ గ్రహీత శాంతి కృష్ణ ఆచార్య



నాటకంలోని ఓ దృశ్యం

పోచమ్మమైదాన్, జూలై 31: నాటక రంగం తరతరాలుగా ప్రజల్లో చైతన్యం, మానసికోల్లాసం, ప్రశాంతతను కలిగిస్తున్నదని గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ గ్రహీత శాంతి కృష్ణ ఆచార్య అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో సుర భి నాటక సమాజం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వా మి జీవిత చరిత్ర నాటకాన్ని ఆయన తిలకించారు. కార్యక్రమంలో నేరెళ్ల వేణుమాధవ్ సతీమణి శోభారాణి, సదానందాచారి, ఆకుల సదానందం, డాక్టర్ ఎన్‌ఎస్‌ఆర్ మూర్తి, దేవరాజు రవీందర్‌రావు, భానోదయ నాటక మండలి అధ్యక్షుడు రేకందార్ నాగబాబు పాల్గొన్నారు.

'అందుబాటులో ఉండాలి'

కరీమాబాద్, జూలై 31: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. బుధవారం ఆమె రంగశాయిపేటలోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అందుబాటులో లేని డాక్టర్, ఫార్మాసిస్టులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఉర్సు దవాఖానను సందర్శించారు. డాక్టర్ లేకపోవడంతో సీకేఎం ఆసుపత్రిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేస్తున్న పాలక పార్టీలు'

మాట్లాడుతున్న గాదగోని రవి

నర్సంపేట, జూలై 31: బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా పాలక పార్టీలు మోసం చేస్తున్నాయని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ధ్వజమెత్తారు. నర్సంపేటలో బుధవారం జరిగిన ఎంసీపీఐయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక పార్టీలు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, మైనార్టీ, బీసీ, గిరిజనులకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, సంపదను, చట్టసభల్లో వాటాను అందించకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో సామాజిక తరగతులను గుర్తించకుండా కేవలం కష్ట జీవులుగా చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో సుధాకర్, కుమారస్వామి, రమేశ్, రవి, ప్రతాప్, బాబురావు, కొమురయ్య, వెంకన్న, రాగసుధ, సంధ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ

కాశీబుగ్గ, జూలై 31: నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ నందిరానాయక్ రౌడీషీటర్లను హెచ్చరించారు. బుధవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ తుమ్మ గోపి, సిబ్బంది ఉన్నారు.

కోళ్ల బోనులో కొండచిలువ

కోడిని తింటున్న కొండచిలువ

పర్వతగిరి, జూలై 31: సోమారం గ్రామంలో షఫీక్ తన ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసుకున్న కోళ్ల బోనులో బుధవారం కొండచిలువ దూరింది. అందులో ఉన్న కోడిని తిని భయాందోళన సృష్టించింది. కొద్ది సమయానికి తిన్న కోడిని బయటకు కక్కడంతో గ్రామస్తులు భయంతో కొండచిలువను హతమార్చారు.

ఈవో కమల సేవలు మరువలేనివి

ఈవోను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కరీమాబాద్, జూలై 31: అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ జాతర ఈవోగా పని చేసిన కమల సేవలు మరువలేనివని అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ కమిటీ సభ్యులు అన్నారు. ఈవో ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఉర్సులోని శ్రీనాగమయ్య ఆలయ ప్రాంగణంలో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో కోడూరి భిక్షపతి, దాసి రాందేవ్, బైరి నాగరాజు, ఆవునూరి కుమారస్వామి, ఆవునూరి నాగరాజు పాల్గొన్నారు.